జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



పాలకొల్లు అర్బన్: లంకలకోడేరులో ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న నాయకులు



పెనుమంట్ర: పాలమూరులో ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

యలమంచిలి: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పెనుమర్రు గ్రామ సచివాలయం వద్ద బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ పేదవాడు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమన్నారు. ఆయన పాలకుడిగా కాకుండా సేవకుడిగా పని చేస్తున్నారన్నారు. అలాంటి సేవకుడికి ప్రజలంతా బాసటగా నిలవాలని గోపి కోరారు. సమావేశం అనంతరం పెనుమర్రు గ్రామంలో ఈ నాలుగున్నరేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీలో 25 పథకాల ద్వారా రూ.15,32,94,715 కోట్లు, పరోక్ష నగదు బదిలీలో మరొక 8 పథకాల ద్వారా రూ.5,37,77,218 కోట్లు, గ్రామాభివృద్ధికి రూ.4,24,27,000 కోట్లు వెరసి మొత్తం రూ.24,94,98,933 కోట్లు ఖర్చు చేసినట్లు వివరిస్తూ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రగతి నివేదిక బోర్డులను ఆయన ప్రారంభించారు. అనంతరం సెంటర్లో ఉన్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులంతా పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడే వైఎస్సార్ సీపీ జెండాను వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాకా సూర్యనారాయణ ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కవురు గోపి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాకా సూర్యనారాయణ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, పెన్మెత్స జలదుర్గా ప్రసాదరాజు, చివటపు నాగేశ్వరరావు, బాలం ఆనంద్, నక్కా సత్యనారాయణ, ముత్తాబత్తుల లక్ష్మీరాధ, యడ్ల శ్రీనుకుమార్, బొక్కా శ్రీనివాస్, చుట్టుగుల్ల శ్రీకాంత్, పాతూరి సోమరాజు, తోటకూర చంటిరాజు, వెల్లాటి బుజ్జి, తాళ్ల కోటేష్ పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు అర్బన్: బడుగు, బలహీన వర్గాల ఆశా దీపంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మండలంలోని లంకలకోడేరులో సచివాలయం వద్ద బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నవరత్నాల పథకాలతో పాటు 33 పథకాలు పేదల సంక్షేమం కోసం అమలు చేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, మరలా ఆయన సీఎంగా గెలిస్తేనే పేదలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. సచివాలయ పరిధిలో ప్రత్యక్ష ప్రయోజనాల కింద రూ.15,41,38,871, పరోక్ష ప్రయోజనాల కింద రూ.5,22,95,052, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.4.99కోట్లు నిధులు ఖర్చు చేసినట్లు గోపి వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏనుగుపల్లి దీప్తి, నల్లం శ్రీకాంత భవాని శ్రీనివాసలను వలంటీర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అలాగే నాగరాజుపేటకు చెందిన డి సుబ్రహ్మణ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును గుడాల గోపి చేతుల మీదుగా అందజేశారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్రి జోగయ్య, గ్రామ ఉపసర్పంచ్ కూనపరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్‌రాజు, గ్రామ పార్టీ నాయకులు ఆరేపల్లి సింహాద్రి, ఏనుగుపల్లి చంద్రశేఖర్, మడికి విక్రమ్, రావూరి చిన్న, తమ్మా కోటయ్య పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు అన్నారు. బుధవారం పాలమూరు-2 సచివాలయ పరిధిలో సర్పంచ్ కాకర రాజేశ్వరరావు అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవేంద్రుడు మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా పేదల సంక్షేమ ఫలాలను వారి ఖాతాల్లోకి జమ చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాబోవు ఎన్నికలలో ఆచంట నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి రంగనాథరాజును మరోసారి గెలిపించుకోవడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసి, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లేటట్లు చూసుకోవాలని ఆయన కోరారు. ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు వడ్లమూడి ప్రదీప్‌కుమార్, చిక్కాల శివయ్య, కొలుకులూరి సతీష్, మార్కండేయస్వామి దేవస్థానం చైర్మన్ సుందర నాగరాజు, పితాని అనంతలక్ష్మి, కౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ చేసిన మంచిని చాటి చెప్పాలి



తూర్పుపాలెంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: నాలుగున్నర ఏళ్ల పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ చేసిన మంచిని ప్రజలకు చాటి చెప్పి విజయంలో ప్రధాన భూమిక వహించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలో ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. ప్రతిపక్షం దిగజారుడుతో దుష్ప్రచారం చేస్తుందని విమర్శించారు. దీనికి భిన్నంగా వారికి తగు సమాధానం చెబుతూ ప్రజలకు చేసిన మంచిని వివరించి ఆదర్శంగా నిలవాలన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరించాలన్నారు. ఆచంట నియోజకవర్గంలో ఇప్పటివరకూ ఎన్నికైన ప్రజా ప్రతినిధుల్లో ఎవరూ అవినీతి పరులో ప్రజలకు తెలుసునని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఎద్దేవా చేశారు. ఉక్రోశం పెరిగి అవాకులు చవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనరు పోతుమూడి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పండిత విల్లూరు కల్వరి శుభవార్త చర్చి క్యాలెండర్‌ను బుధవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆవిష్కరించారు. సమాజ శాంతి కోసం క్రీస్తు బోధనలు చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టరు పోతుమూడి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, చేకూరి సూరిబాబు, గెద్దాడ ఏకలవ్య, కల్వరి గుడ్ న్యూస్ మినిస్ట్రీస్ పౌండర్ ప్రెసిడెంట్ బీడీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

పెనుమంట్ర: ఆలమూరు రైస్‌మిల్లు వద్ద మంగళవారం అర్ధరాత్రి మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఓడూరుకు చెందిన ఎస్.దానయ్య, వైజాగ్‌కు చెందిన జి.రాజు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ బాలకృష్ణ, పైలెట్ మహేష్ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, ఆసుపత్రికి తరలించారు.

పారదర్శకంగా పంట నష్ట నమోదు

పెనుగొండ: మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన వరిచేల నమోదును పారదర్శకంగా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆచంట మండలం పెనుమంచిలి, ఆచంట, వల్లూరుల్లో తుపాను కారణంగా నష్టపోయిన వరిచేలను నమోదు ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అడ్డాల పార్వతి, ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, తహసీల్దారు సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

పెనుమంట్ర: తనపై నమ్మకం ఉంచి వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని కొవ్వూరి వేణుమాధవరెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లిలో నిర్వహించిన తొలి రాష్ట్రస్థాయి యువజన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఫోన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి అండగా ఉంటూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా యువజన అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు.

ముగిసిన కార్తీక పూజలు

పాలకొల్లు సెంట్రల్: కార్తీకమాసం ముగియడంతో బుధవారం వేకువజామున మహిళలు పెద్ద సంఖ్యలో కాలువ స్నానాలు చేసి పోలిస్వర్గం దీపాలను వెలిగించారు. అరటి డొప్పలు, కొబ్బరి చిప్పల్లో ఆవునెయ్యితో తయారు చేసిన దీపాలను వెలిగించి ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, దీపాలను కాలువలో వదిలారు. క్షీరారామరామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయంలో పాడ్యమి దీపాలను వెలిగించారు.

కిక్కిరిసిన గోదావరి తీరం

నరసాపురం: కార్తీకమాసం చివరి రోజు పవిత్ర పోలి పాడ్యమి పూజలు నరసాపురం గోదావరి తీరంలో బుధవారం ఘనంగా జరిగాయి. వశిష్టగోదావరి వలందర్‌రేవు భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున పవిత్ర గోదావరి స్నానాలు చేసి రేవులో పూజలు చేశారు. గోదావరిలో దీపాలు వదిలారు. అనంతరం శివాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కపిలమల్లేశ్వరస్వామి ఆలయం, అమరేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మంత్రి జోగి రమేష్ నేడు రాక

నరసాపురం: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ గురువారం నరసాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారు. మొగల్తూరు మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొంటారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కార్యాలయం బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 10 గంటలకు మంత్రి పట్టణంలోని ముదునూరి కార్యాలయానికి చేరుకుని అక్కడ నుంచి మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ జరిగే రహదారుల ప్రారంభ కార్యక్రమంలో ముదునూరితో కలసి పాల్గొంటారు. అనంతరం రామన్నపాలెం -1 సచివాలయం వద్ద జరిగే సభలో మాట్లాడతారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పాలకొల్లు సెంట్రల్ : పూలపల్లిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగి బంగారం, నగదు అపహరణకు గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఇంట్లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వి.నాగవల్లి, ఆమె తల్లి నివాసం ఉంటున్నారు. ఈ నెల 9వ తేదీన ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. 12వ తేదీ సాయంత్రానికి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం లేకుండా తలుపు దగ్గరకు వేసి ఉండడం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా, రెండు కాసులు బంగారం, రూ.10 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బుధవారం నాగవల్లి పోలీసులను ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ సీఐ డి.రాంబాబు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.ముత్యాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్నకు ఓటు వేయాలి

యలమంచిలి: రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మరొకసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం అబ్బిరాజుపాలెం గ్రామంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. సిఫారసులకు, లంచాలకు తావులేకుండా ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా మీకే అందాలంటే జగనన్నకు మరొక అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కామిశెట్టి సాయిబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గాడి దుర్గాప్రసాద్, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు యడ్ల తాతాజీ, ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, జేసీఎస్ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, సర్పంచ్ చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, పార్టీ జిల్లా కమిటి సభ్యులు బోనం బులి వెంకన్న నాయకులు శిరిగినీడి దొరబాబు, శిరిగినీడి రామకృష్ణ, శిరిగినీడి నాగభూషణం, అడబాల మునీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అబ్బిరాజుపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

సమన్వయ సదస్సు వాయిదా

పెనుగొండ: మిచాంగ్ తుపాన్‌తో నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకునేందుకు గురువారం నిర్వహించనున్న రైతు, కౌలు రైతు సమన్వయ సదస్సు వాయిదా వేసినట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాసూళ్లు ముమ్మరంగా సాగుతుండడంతో సదస్సుకు హాజరుకావడం ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు, కౌలు రైతులు, వాయిదా వేయాలని విజ్ఞప్తి చేయడంతో మరోసారి నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు. త్వరలోనే సదస్సు నిర్వహణ తేదీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

పాలకొల్లు సెంట్రల్: ఎస్ఎఫ్ఐ 45వ జిల్లా మహాసభలు పట్టణంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు పి.వాసు తెలిపారు. బుధవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశంలో వాసు మాట్లాడుతూ 15, 16 తేదీల్లో జిల్లా మహాసభలు డీఎన్నార్ కళాశాల పక్కనున్న ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నుంచి విద్యార్థుల ప్రదర్శన మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సభ్యులు శేఖర్, యశ్వంత్, సతీష్, శ్రీనుబాబు, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.